క్లుప్తంగా

రామనాథంబాబుకు శుభాకాంక్షలు తెలిపిన సీఐలు



రామనాథంబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న సీఐలు

పర్చూరు: మండల పరిధిలోని అడుసుమల్లి గ్రామంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ రావి రామనాథం బాబును సీఐలు ఫిరోజ్, వీ సూర్యనారాయణలు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. అతని చేతికి పుష్ప గుచ్చం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పర్చూరు ఎస్సై జీవీ చౌదరి ఉన్నారు. అనంతరం నియోజక వర్గ ఎస్సీ సెల్ కన్వీనర్ పాలెపోగు రాంబాబు, గొల్లపూడి సర్పంచ్ ఎర్రాకుల రామకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

పరిశ్రమల స్థాపనతో ఆర్థికాభివృద్ధి

చీరాల టౌన్: ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమ క్రమబద్ధీకరణ పథకంతో సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలు స్థాపించడం వలన ఆర్థికాభివృద్ధి చెందుతారని వైఎస్సార్ కేపీ ఏపీఎం సుబ్బారావు అన్నారు. సోమవారం బుర్లవారిపాలెంలో వైఎస్సార్ కేపీ కార్యాలయంలో పీఎంఎఫ్ఎంఈ పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశంలో ఏపీఎం మాట్లాడుతూ పీఎంఎఫ్ఎంఈ పథకంతో లబ్ధిదారులకు రూ.1లక్ష నుంచి రూ.50 లక్షల వరకు రుణ సదుపాయం కల్పిస్తున్నారన్నారు. సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలను ఏర్పాటు చేయడంతో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలతో పాటుగా ఆర్థికంగా వృద్ధి సారిస్తారన్నారు. పథకం ద్వారా రుణం తీసుకున్న లబ్ధిదారులకు 35 శాతం సబ్సిడీ లభిస్తుందన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, డైరీ ప్రాసెసింగ్ యూనిట్లు, పండ్లు, కూరగాయల అమ్మకాలు, ఇతర వ్యాపార సంస్థలను నెలకొల్పేందుకు ఈపథకం ద్వారా ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలన్నారు. సమావేశంలో సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

18లోపు పరీక్ష ఫీజు చెల్లించాలి

అద్దంకి రూరల్: కేఆర్కే కళాశాలలోని అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ స్టడీ సెంటర్‌లో ఓపెన్ డిగ్రీ విద్యార్థులు ప్రథమ, తృతీయ, ఐదో సెమిస్టర్ పరీక్ష ఫీజులు ఈనెల 18వతేదీ లోపు చెల్లించాలని స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ కే ప్రభుదాసు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు తమ ఫీజులను మీసేవా లేదా ఇంటర్‌నెట్ ద్వారా చెల్లించవచ్చన్నారు. వివరాలకు 73829 29672, 99124 14614 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఇంటిపన్ను వసూలు చేయాలి

చీరాల టౌన్: పంచాయతీల్లో పేరుకుపోయిన ఇంటి పన్నుల బకాయిలను నెలాఖరులోపు పూర్తి చేయాలని ఎంపీడీవో నేతాజీ కార్యదర్శులకు సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని గ్రామ పంచాయతీల కార్యదర్శులు, సచివాలయాల కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో ఎంపీడీవో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఈవోఆర్డీ మురళీబాపూజీ, పంచాయితీల కార్యదర్శులు గౌస్, ఇమ్రాన్‌ఖాన్, చక్రవర్తి, గౌసియా, మాధవి, శ్రీనివాసరావులు ఉన్నారు.

జెడ్పీటీసీ గంగాభవాని మృతికి సంతాపం



శ్రద్ధాంజలి ఘటిస్తున్న మండల సిబ్బంది

పర్చూరు: గుండెపోటుతో మృతి చెందిన పర్చూరు జెడ్పీటీసీ కొల్లా గంగాభవాని మృతికి పలువురు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బంది మౌనం పాటించారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కేవీపాలెంలో క్రికెట్ టోర్నమెంట్

బల్లికురవ: సంక్రాంతి పర్వదినం సందర్భంగా మండలంలోని కొమ్మినేనివారిపాలెం గ్రామంలో గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఎనిమిదో తేదీ నుంచి క్రికెట్ పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి బహుమతిగా రూ.30,116, రెండో బహుమతిగా రూ.20,116, మూడో బహుమతిగా రూ.10,116, మ్యాన్ ఆఫ్ ద సిరీస్ కింద రూ.3,116 విజేతలకు అందజేయనున్నట్లు తెలిపారు. వివరాలకు 76709 49842 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఉత్తరద్వార దర్శనం ముక్తికి మార్గం



శింగరకొండ ఉత్తర రాజగోపురంలో ఏర్పాటు చేసిన ద్వార దర్శనం



పర్చూరు: త్రివిక్రమ అగస్త్యేశ్వర స్వామి వారి గ్రామోత్సవం



కడవకుదురులో శ్రీరామచంద్రుని ఉత్తర ద్వార దర్శనం



వేటపాలెంలో శేషవాహనంపై స్వామివారు



మార్టూరు: అలంకరణలో మహా విష్ణువు

- హరి నామస్మరణతో మార్మోగిన వైష్ణవాలయాలు
- భక్తి శ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి

అద్దంకి/బల్లికురవ/జే.పంగులూరు/మేదరమెట్ల: సంవత్సరానికి 24 ఏకాదశులు వస్తుంటాయి. అందులో సూర్యుడు ఉత్తరాయణంలోకి మారే ముందుగా వచ్చే ధనుర్మాస శుద్ధ ఏకాదశినే వైకుంఠ ఏకాదశి లేదా ముక్కోటి ఏకాదశి అంటారు. ఈ ఏకాదశి నాడు వైకుంఠంలో శ్రీమహావిష్ణువు వైకుంఠ ద్వారాలు తెరిచారని శాస్త్రం. అదే విధంగా ఇదే రోజు విష్ణువు దేవతలతో కలసి భూలోకం వచ్చి ఉత్తర ద్వారదర్శనం చేసిన వారికి ముక్తిని ప్రసాదిస్తారని భక్తుల నమ్మకం. ఈసందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా వైష్ణవాలయాల్లో ముక్కోటి ఏకాదశి పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో సోమవారం జరుపుకున్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో ఉత్తర ద్వారం తెరచి భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు. అదే విధంగా పట్టణంలోని కాకానిపాలెంలోని రంగనాయక స్వామి ఆలయంలో ఉత్తర ద్వారం నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య పట్టణంలోని రంగనాయకుల స్వామి ఆలయంలో ఉత్తరం ద్వారం నుంచి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, స్థానిక నేతలు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సంతమాగులూరు మండలంలోని కొమ్మాలపాడు గ్రామంలోని రామాలయంలో భక్తులకు ఉత్తర ద్వారం నుంచి స్వామివారి దర్శనం కల్పించారు.

★ బల్లికురవ మండలంలోని కొనిదెన, కొత్తపాలెం, కొమ్మినేనివారిపాలెం, కొప్పరపాలెం, కొండాయపాలెం, గ్రామాల్లోని విష్ణు ఆలయాల అర్చకులు ఐవీఎం శోభానాచార్యులు, సుబ్బాచార్యులు నారాయణం శ్రీనివాస అనీల్ కుమార్, రంగాచార్యులు మారుతీ నరేశ్ వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు గోవింద నామస్మరణతో స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

★ కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆలయ నిర్వాహకులు ఉత్తర ద్వారం ద్వారా స్వామిని దర్శించుకునేలా ఏర్పాట్లు చేశారు. ఉత్తర ద్వారం ద్వారా తెల్లవారి జాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

★ జే.పంగులూరు మండల పరిధిలోని గ్రామాల దేవాలయాల్లో వైకుంఠ ఏకాదశి ఘనంగా జరిగాయి. పంగులూరు వేణుగోపాలస్వామి దేవాలయంలో గత వారం రోజుల నుంచి స్వామి వారి భజన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అనంతరం స్వామి వారిని గ్రామంలో ఊరేగించారు.



అద్దంకి: ప్రత్యేక పూజలు చేస్తున్న చైతన్య

ముప్పవరం గ్రామంలో స్వామి వార్లను గ్రామోత్సవం నిర్వహించారు.

గోవింద నామస్మరణతో పాపాలు దూరం..

పర్చూరు/కారంచేడు/మార్టూరు/యద్దనపూడి/చినగంజాం: గోవింద నామస్మరణతో పాపాలు దూరమవుతాయని అర్చకులు అన్నారు. మండలంలోని చినగంజాం, కడవకుదురు, పెదగంజాం, సంతరావూరు, చింతగుంపల గ్రామాల్లో వైష్ణవ ఆలయాల్లో స్వామి వారి వైకుంఠ ద్వారదర్శనం ఏర్పాటు చేశారు. చినగంజాం శ్రీదేవీ, భూదేవీ సమేత భావన్నారాయణ స్వామి దేవాలయం నందు భావన్నారాయణ స్వామి, కడవకుదురు సీతారామ లక్ష్మణ హనుమ సమేత కోదండ రామస్వామి దేవస్థానంలో రామచంద్రుని ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేశారు.

★ పర్చూరు మండలంలోని చెరుకూరు గ్రామంలో త్రివిక్రమ అగస్త్యేశ్వరస్వామి వారి దేవస్థానం నందు స్వామివారి ఉత్తర ద్వారా దర్శనం ఏర్పాటు చేశారు. భక్తులు స్వామిని సందర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తుల దర్శనానంతరం స్వామివారిని గ్రామోత్సవం నిర్వహించారు. మంగళవాయిద్యాలతో గ్రామ వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు.



చింతపల్లిపాడులో హరేరామనామ సంకీర్తన చేస్తున్న భక్తులు

★ యద్దనపూడి మండలంలోని చింతపల్లిపాడు చెన్నకేశవస్వామి, గన్నవరం వేణుగోపాలస్వామి, యద్దనపూడిలోని వెంకటేశ్వరస్వామి, పూనూరు వేణుగోపాలస్వామి ఆలయాల్లో స్వామివార్లను దర్శించుకునేందుకు ఉత్తరద్వారం దర్శనం ఏర్పాటు చేశారు. ఆలయాల్లో హరేరామనామ సంకీర్తన, గోవింద నామస్మరణ, భగవద్గీత పారాయణలు నిర్వహించారు.

★ కారంచేడు పెద్ద బజారు శివాలయం, వెంకటేశ్వ స్వామి గుడి, గంగమ్మతల్లి గుడి, సాయిమందిరం, కట్టమల్లేశ్వరస్వామి గుడి, వేణుగోపాలస్వామి గుడి, మండలంలోని స్వర్ణ వల్లభరాయస్వామి వారి దేవాలయం, వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు నిర్వహించారు.

★ మార్టూరులోని చెన్నకేశవ స్వామి, బలరాం కాలనీ సమీపంలోని రుక్మాబాయి సమేత పాండు రంగ స్వామి ఆలయంలో, ఇసుక దరిశి జాతీయ రహదారిపై గల పాండురంగస్వామి ఆలయంలో భక్తులు ఉదయం నుండే బారులు తీరి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కిటకిటలాడిన వైష్ణవాలయాలు..

వేటపాలెం/చీరాల టౌన్: వైకుంఠ ఏకాదశి సందర్భంగా వైష్ణవ దేవాలయాల్లో భక్తులు హరినారాయణ స్మరణలతో మార్మోగాయి. ఆణమల్లిపేటలో వేంచేసియున్న రుక్మీసత్యబామ సమేత వేణుగోపాలస్వామి వారి దేవస్థానంలో ప్రత్యేక పుజలు నిర్వహించారు. స్వామి వారిని గ్రామలో ఊరేగింపు నిర్వహించారు. స్థానిక వేణగోపాల స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశిని పురస్కరించు కొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

★ చీరాల మండలంలోని ఈపురుపాలెంలోని అనంత పద్మనాభస్వామి దేవాలయం, భావనారుషిస్వామి దేవాలయం, వీరరాఘవస్వామి దేవాలయం, రామకృష్ణాపురం, జాండ్రపేట, తోటవారిపాలెం తదితర గ్రామాల్లోని దేవాలయాల్లో ఉత్తర ధ్వార దర్శనానికి భక్తులు బారులు తీరారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.



మేదరమెట్లలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



స్వర్ణలో దీపారాధన నిర్వహిస్తున్న భక్తులు



కొత్తపాలెంలో అలంకరణలో కోదండరామచంద్రస్వామి



ముప్పవరంలో స్వామి వార్లను ఊరేగిస్తున్న భక్తులు



చినగంజాం: ఉత్తర ద్వార దర్శనం చేసుకుంటున్న భక్తులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



అద్దంకిలో లబ్ధిదారులకు పింఛన్ అందజేస్తున్న కృష్ణచైతన్య



కేవీపాలెంలో పథకాల పనితీరును తెలుసుకుంటున్న చైతన్య

- రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య

బల్లికురవ: పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ నంబర్‌వన్ సీఎంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గుర్తింపు పొందారని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. సోమవారం సాయంత్రం మండలంలోని కొమ్మినేనివారిపాలెం గ్రామంలోని ఎస్సీ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. అంతకు ముందు గ్రామ కూడలిలోని వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరు వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పనితీరు తెలుసుకున్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా పెన్షన్ పెంచిన ఘనత జగనన్నదేనన్నారు. చంద్రబాబు పదవీ కాంక్షతో రాష్ట్రం జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక దుష్ప్రచారాలతో కందుకూరు, గుంటూరుల్లో 11 మంది ప్రాణాలు బలితీసుకున్నారని విమర్శించారు. ఇదంతా ప్రజలు గమనిస్తూనే ఉన్నారని రాబోయో ఎన్నికల్లో కూడా వైఎస్సార్ సీపీకి పట్టం కట్టేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారని చైతన్య అన్నారు. ఎస్టీ కాలనీ వాసులు విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలని కృష్ణచైతన్య దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ చింతల పేరయ్య, ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ చింతల అంజలీ శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ యర్రా శాంతమ్మ సొసైటీ అధ్యక్షుడు దర్శి రామకృష్ణారావు, స్థానిక నేతలు దర్శి శ్రీరామమూర్తి, గోగినేని వేణు, ఎంపీడీవో సీహెచ్ కృష్ణ, సెక్రటరీ ఎస్‌కె ఆర్ ఖాన్, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి పింఛన్..

అద్దంకి రూరల్: ప్రభుత్వం అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి కులమతాలకు అతీతంగా పింఛన్ అందజేస్తుందని శాప్‌నెట్ చైర్మన్ కృష్ణ చైతన్య అన్నారు. సోమవారం స్థానిక పురపాలక సంఘ కార్యాలయం, స్థానిక ఎంపీడీవో కార్యాలయాల్లో కృష్ణచైతన్య చేతుల మీదుగా నూతన పెన్షన్లు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణచైతన్య మాట్లాడుతూ సీఎం ఇచ్చిన మాట ప్రకారం జనవరి నుంచి రూ. 2750 పింఛన్ అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎల్ ఎస్తేరమ్మ, వైస్ చైర్మన్‌లు పద్మేష్, కె. అనంతలక్ష్మి, ఎంపీపీ అవిశెన జ్యోతి, ఎంపీడీవో ప్రద్యుమ్న కుమార్, మండల కన్వీనర్ జ్యోతి హనుమంతరావు, కాకాని రాధకృష్ణమూర్తి, సందిరెడ్డి రమేష్, శింగరకొండ లక్ష్మీ నరసింహా స్వామి దేవస్థానం ట్రస్ట్ చైర్మన్ నర్రావుల కొండలు, సర్పంచ్‌లు, కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.

ఆర్బీకే ఉద్యోగిపై రైతులు ఫిర్యాదు

యద్దనపూడి: తక్కువ ధరలకు ఎరువులు ఇప్పిస్తానని రైతులను మోసగించిన రైతుభరోసా కేంద్రం ఉద్యోగిపై బాధిత రైతులు పోలీసులకు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈఘటన యద్దనపూడి మండలంలో సోమవారం వెలుగు చూసింది. పోలీసులు, బాధిత రైతులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని అనంతవరం గ్రామంలోని రైతుభరోసా కేంద్రంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కాసా దానియేలు గతంలో మార్టూరు మండలంలోని ద్రోణాదుల గ్రామంలో ఎంపీఈవోగా పనిచేశాడు. ఆ పరిచయాలతో ద్రోణాదుల్లోని కొంత మంది రైతులకు కాంప్లెక్స్ ఎరువులు తక్కువ ధరకే ఇప్పిస్తానంటూ వారి వద్ద నుంచి దానియేలు ఫోనుకు ఫోన్‌పే ద్వారా రూ.1.15 లక్షలు బదిలీ చేయించుకున్నాడు. తమకు ఎంతకు దానియేలు ఎరువులు ఇవ్వకపోవటంతో రైతులు దానియేలుపై ఒత్తిడి చేయసాగారు. వారంరోజుల క్రితం అనంతవరం గ్రామంలోని ఆర్బీకే కేంద్రానికి వచ్చి దానియేలు కోసం ఆరా తీసిన బాధిత రైతులు అక్కడ స్థానిక రైతులను కూడా ఇలానే మోసగించినట్లు తెలిసిందని సమాచారం. ఈ క్రమంలో ద్రోణాదుల రైతులు ఏవో ఆదినారాయణకు, ఏడీఏ మోహన్‌రావు దృష్టికి తీసుకువెళ్లటమే కాక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వ్యవసాయాధికారి ఆదినారాయణ, ఏడీఏ మోహన్‌రావు, ఎంపీడీవో కృష్ణకుమారి జరిగిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు.

రెండు వర్గాల యువకుల మధ్య ఘర్షణ

చీరాల: పట్టణంలోని రెండు ప్రాంతాలకు చెందిన యువకులు సోమవారం రాత్రి పరస్పర దాడులు చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని జయంతిపేట, మరియమ్మపేటకు చెందిన కొందరు యువకులు మధ్య పాత గొడవలు ఉన్నాయి. దీంతో సోమవారం రాత్రి ఇరు వర్గాల యువకులు ఘర్షణకు దిగారు. ఇరువర్గాలు పరస్పరం దాడులు చేసుకోగా పలువురికి గాయాలయ్యాయి. ఇద్దరు యువకులు చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స నిమిత్తం చేరారు. మరాల వైద్యశాల వద్దకు వచ్చిన ఇరువర్గాల యువకులు అక్కడ ఘర్షణకు దిగారు. సమాచారం తెలుసుకున్న ఒన్‌టౌన్, టూటౌన్ పోలీసులు సిబ్బంది వైద్యశాలకు చేరుకుని ఘర్షణకు పాల్పడుతున్న వారిని చెదరగొట్టారు. ఈ మేరకు బాధితుల వద్ద నుంచి పోలీసులు వివరాలను సేకరించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఒన్‌టౌన్, టూటౌన్ సీఐలు మల్లిఖార్జునరావు, సోమశేఖర్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ డీఈవో కిరణ్‌కుమార్



యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ సుజ్ఞానమ్మ

పర్చూరు: పర్చూరు వైఆర్ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుల సంఘం క్యాలెండర్, డైరీని పర్చూరు ఉప విద్యాశాఖాధికారి ఏ కిరణ్ కుమార్, పర్చూరు ఎంఈవో దోమా నాగేశ్వరరావులు సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మొలతోటి వెంకటేశ్వర్లు, ఈదర రాజశేఖర్, గుమ్మా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మార్టూరు: మార్టూరులో సోమవారం యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరించారు. జెడ్పీ వైస్ చైర్మన్ చుండి సుజ్ఞానమ్మ స్వగృహంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు ఆమెకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు శ్రీపతి వెంకట సుబ్బయ్య, పోపూరి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

పటిష్టంగా సమ్మెటివ్ పరీక్షలు



ప్రశ్న పత్రాలతో ఎంఈవో, హెచ్ఎంలు

కారంచేడు: ఈ నెల 4వ తేదీ నుంచి 10వ తేదీ వరకు మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో నిర్వహించబోయే ఎస్ఏ-1 పరీక్షలను పటిష్టంగా నిర్వహించాల్సి ఉందని ఎంఈవో ఎంవీ సత్యన్నారాయణ అన్నారు. సోమవారం ఆయన మండల విద్యావనరుల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయా ప్రాఠశాలల హెచ్ఎలంతో సమావేశం నిర్వహించారు. ప్రతి రోజు సబ్జెక్టుల వారీగా జరిగే ప్రశ్నపత్రాలను తీసుకెళ్లి పరీక్షల అనంతరం మరలా ఎమ్మార్సీలో భద్రపర్చుకోవాలన్నారు. మండలంలో ఐదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 1 ప్రైవేటు ఉన్నత పాఠశాల, 1 యూపీతో పాటు అన్ని ప్రాథమిక పాఠశాలల ప్రశ్నే పత్రాలను బద్రపరిచామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

2023 అందరికీ శుభప్రదం కావాలి

బల్లికురవ: నూతన ఆంగ్ల సంవత్సరం రైతులు, వ్యవసాయ కూలీలు, వ్యాపారులు, ఉద్యోగులకు శుభప్రదం కావాలని వల్లాపల్లి సర్పంచ్ మందా మోహన్‌రావు కోరారు. సోమవారం వల్లాపల్లిలో నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా ఎస్సీకాలనిలో కేక్‌కట్ చేసి గ్రామ పెద్దల సహకారంతో చర్చి వద్ద అన్నదానం చేపట్టారు. సొసైటీ అధ్యక్షుడు మంచాల శ్రీనివాసరెడ్డి, నేతలు మందా సుబ్బారావు, చిన్నా, మేడగం పాల్గొన్నారు.

7న సర్వసభ్య సమావేశం

మేదరమెట్ల: కొరిశపాడు మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం జనవరి 7వ తేదీ ఉదయం 11 గంటలకు నిర్వహిస్తారని ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీలక్ష్మీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలని ఆమె కోరారు.

11న అద్దంకి మండల సమావేశం

అద్దంకి రూరల్: ఈనెల 11న అద్దంకి మండలప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన ఉదయం 10 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రద్యుమ్న కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి

చినగంజాం: ఆర్యవైశ్యుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఇంకొల్లు వాసవీ క్లబ్ నూతన అధ్యక్షుడు చిన్ని పూర్ణారావు అన్నారు. ఇంకొల్లు వాసవీ ఆర్యవైశ్య కల్యాణ మండపం నందు సోమవారం ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో డోగిపర్తి అయ్యప్పస్వామి 2022 సంవత్సరానికి సంబంధించిన నివేదికను అందజేశారు. వాసవీ క్లబ్ ఎన్నికల్లో చిన్ని పూర్ణారావు అధ్యక్షుడుగా ఎన్నిక కావడం వీరితోపాటు కార్యదర్శిగా డోగిపర్తి బదరీ నారాయణ, కోశాధికారిగా భైసాని నరసింహం శెట్టి ఎంపిక కావడంపై సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రీజన్-3 చైర్మన్ వైవీ సాంబశివరావు, బెల్లంకొండ శ్రీనివాసరావు, డోగిపర్తి చెన్నకేశవ రావు తదితరులు పాల్గొన్నారు.